ఆంధ్రజ్యోతి

20 APR 2018

## సీఎస్ఆర్ నిధులతో డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు

యానాం, ఏప్రిల్ 19: నియోజకవర్గంలో పలు సంస్థల ద్వారా ఇచ్చే సీఎస్ఆర్ నిధులకు సంబంధించిన వడ్డీ డబ్బులతో 8 పాఠశాలల్లో డిజిటల్ తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పుదుచ్చేరిలో సీఎం నారాయణస్వామి అధ్యక్షతన సీఎస్ఆర్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వచ్చే వడ్డీ నిధులు సుమారు రూ.4కోట్ల 50లక్షలతో ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. వీటిలో మెట్టకూరు లోని పిపర్‌మెన్‌పేట (అగ్నికుల క్షత్రియ) వద్ద ప్లాట్‌ఫారమ్ నిర్మాణానికి రూ.69 లక్షల20వేలు, రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పుష్కర ఘాట్ పక్కన చేపల విక్రయానికి ప్లాట్‌ఫారమ్, షెడ్ నిర్మాణానికి రూ.59లక్షల 54వేలు, అయ్యన్ననగర్ నుంచి యానాం స్టీల్స్ వరకు సుమారు 2900 మీటర్ల డ్రెడ్జింగ్ పనులకు సుమారు కోటి రూపాయలు నిధులకు ఆమోదం తెలిపారు. యానాంలోని గిరియాంపేట కామరాజర్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులకు సంబంధించి 40 కంప్యూటర్లు, దరియాలతిప్ప కేఆర్ నారాయణ పాఠశాలకు 40, పరంపేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాఠశాలలో 30, మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్‌లో 30, రాజీవ్‌గాంధీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 40, కమలానెహ్రూ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 30, కనకాలపేట కామిశెట్టి వరప్రసాదరావు నాయుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30, శారదా ఎయిడెడ్ పాఠశాలలో 40 కంప్యూటర్లను, ప్రొజెక్టర్‌ను తదితర పరికరాల ఏర్పాటుకు రూ.2కోట్ల 12లక్షలను ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

## 'సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగవు'

యానాం, ఏప్రిల్ 19: సంక్షేమ పథకాల అమలు కొంత సమయం ఆలస్యమైనా ఇచ్చితీరుతామని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం క్యాంప్ కార్యాలయం వద్ద వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మల్లాడి మాట్లాడారు. యానాంలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు పిల్లల సంరక్షణకు అవసరమైన కిట్లను మంత్రి అందజేశారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు స్ప్రేయర్లు, గునపాలను పంపిణీ చేశారు. దివ్యాంగులు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆరోగ్యశాఖ డీడీ ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజర్ చింతా రామజోగి, డిప్యూటీ తహసీల్దార్ సైబు పాల్గొన్నారు.



బేబీకిట్లను అందజేస్తున్న మంత్రి మల్లాడి

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సావిత్రినగర్ (యానాం), ఏప్రిల్ 19: యానాం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి మల్లాడి కృష్ణారావు సూచించారు. తీరగ్రామాలైన సావిత్రినగర్, గిరియాంపేటలతోపాటు దరియాలతిప్ప యానాంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ప్రజాపనులశాఖ అధికార్లతో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రజాపనులశాఖ ఈఈ రాందాస్, జూనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## మున్సిపల్ షాపుల అద్దె దారులతో సమావేశం

యానాం,ఏప్రిల్19: మున్సిపల్ శాఖకు సంబంధించి నియోజకవర్గంలో ఉన్న పలు షాపులలో అద్దెకు ఉంటున్న అద్దెదారులతో మంత్రి మల్లాడి కృష్ణారావు సమావేశం నిర్వహించారు. తన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. 127 షాపులకు సంబంధించి అద్దె పెంపుపై పుదుచ్చేరి ప్రభుత్వం అద్దెదారులకు నోటీసులు జారీ చేసింది. మూడు నెలల్లో షాపులు ఖాళీ చేయాలని, అనంతరం బహిరంగ వేలం ద్వారా షాపుల ప్రక్రియ ఎంపిక చేయనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు అద్దెదారులు గతంలో మంత్రి మల్లాడితో కలిసి తమ సమస్యలను విన్నవించారు. పుదుచ్చేరి అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్టు మల్లాడి చెప్పారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ గౌరి సరోజ పాల్గొన్నారు.

## మే నుంచి జిప్‌మేర్ పనులు

యానాం, ఏప్రిల్ 19: కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో రానున్న మే నెల నుంచి జిప్‌మేర్ (మల్టీస్పెషల్ క్యాజువాలిటీ యూనిట్) 82 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభం కానున్నాయని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. తొలిదశలో ఆసుపత్రి నిర్మాణానికి రూ.28కోట్ల 45 లక్షల64వేలు మంజూరు కాగా తొలివిడతగా రూ.22కోట్ల 50లక్షల మేర నిధులు కేటాయించారన్నారు. మిగిలినవి రానున్న బడ్జెట్‌లో విడుదల చేయనున్నారు. ఆసుపత్రిలో అత్యాధునికమైన పరికరాలకు తొలివిడతలో రూ.17 కోట్ల 19లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే నిర్మాణానికి స్థల సేకరణ పూర్తి చేశారని, వాటిలో ఉన్న పూర్వపు కట్టడాలను తొలగించి మే మొదటి వారం నుంచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెండోవిడతలో భాగంగా 91 మందికి క్వార్టర్స్ నిర్మాణం, వాటిలో ఫేజ్-1లో 8, ఫేజ్-2లో 83 మందికి నిర్మాణం చేపట్టనున్నారు. యానాంలో ఆసుపత్రికి సంబంధించి మొత్తం 279 (స్వీపర్ నుంచి స్పెషలిస్ట్ డాక్టర్ వరకు) ఉద్యోగాలు భర్తీకి చర్యలు చేపట్టనున్నారు. 139 పోస్టులను కేంద్ర ప్రభుత్వం సర్వీసుల ఆధారంగా నియామకం చేపట్టనుంది. మిగిలిన 140 పోస్టులను అవుట్ సోర్సింగ్‌లో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## ఉచిత బియ్యం విడుదలకు బ్రేక్!

యానాం, ఏప్రిల్ 19: కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్‌కార్డులకు మూడు నెలలకు ఉచిత బియ్యం పంపిణీకి షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసిన పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తర్వాత మళ్లీ బ్రేక్ వేశారు.

## అట్రాసిటీ కేసులో జైలు

యానాం, ఏప్రిల్ 17: సమాచారహక్కు చట్టం ఉద్యమకారుడు, పుదుచ్చేరి విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న పి.వీరప్పన్‌కు యానాం సబ్‌కోర్టు న్యాయమూర్తి ఏఎస్ హరిహరకుమార్ ఎస్సీ ఎస్టీ వేధింపుల చట్టం కింద నమోదైన కేసులో రెండు నెలల రిమాండ్, రూ.2500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఏపీపీ గెద్ద సత్యనారాయణ తెలిపారు. 2009 అక్టోబర్ 20న ద్రాక్షారామ రోడ్‌లో వస్తుండగా తనను వీరప్పన్ సైకిల్‌తో ఢీకొట్టి కులం పేరుతో దుర్భాషలాడినట్టు భీంనగర్‌కు చెందిన ముమ్మిడివరపు గణపతి ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్‌రైట్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును పుదుచ్చేరి హెడ్‌క్వార్టర్స్ ఎస్పీ కొండా వెంకటేశ్వరరావు పరిశోధించారని, సెక్షన్ 323 ఐపీసీ కింద రూ.1000, 506 క్లాజ్ రెండు కింద నెల రోజులు జైలు, రూ.1000 జరిమానా, 7(1)(డి) పీసీఆర్ యాక్ట్ కింద రూ.500, నెల రోజులు జైలు విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు.

## ఏపీపీ కొనసాగింపునకు ఆదేశాలు

యానాం, ఏప్రిల్ 19:యానాం సబ్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరుగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది నడింపల్లి సత్యనారాయణరాజు (ఎన్ఎస్ఎన్ రాజు)ను ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఏజీపీ, ఏపీపీగా కొనసాగేందుకు అనుమతిస్తూ పుదుచ్చేరి న్యాయ శాఖ ప్రాసిక్యూషన్ డైరెక్టర్ వి.రుద్రకుమరన్ ఆదేశాలు జారీ చేశారు.

ఈనాడు 20 APR 2018

# బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ



బాలింతలకు బేబీ కిట్లను అందజేస్తున్న మల్లాడి

**యానాం, న్యూస్‌టుడే:** యానాం స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న బేటీ బచావో- బేటీ పడావో పథకంలో భాగంగా నియోజకవర్గంలోని 195 మంది బాలింతలకు బేబీ కిట్లను, పౌష్టికాహార ప్యాకెట్లను పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు గురువారం పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ అతిథిగృహం క్యాంపు కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన 290 మంది రైతులు, వ్యవసాయ కూలీలకు రాయితీపై పిచికారి యంత్రాలు, గునపాలు, 123 మంది దివ్యాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాలు, 48 మంది మహిళలకు రూ.15 వేలు, ఎనిమిది మంది వితంతులకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయం, ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయల నగదును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆరోగ్యశాఖ డీడీ ఎంవీఎస్ ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజర్ చింతా రామజోగి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గిడ్డి చంద్రరావు, కాంగ్రెస్ నాయకుడు ఎం.ఎ.సిరాజుద్దీన్ బృందం పాల్గొన్నారు.

◆ గిరియాంపేటలోని పెరుంతలైవర్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల తరగతి పనులు, పైపులైను నిర్మాణం, మూడో నంబరు దీవిలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను మల్లాడి పరిశీలించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామదాస్, ఏఈ మేడిశెట్టి శ్రీనివాస్ బృందం పాల్గొన్నారు.

## మున్సిపల్ దుకాణాల నిర్వాహకులతో సమావేశం

**యానాం:** పుదుచ్చేరి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ దుకాణాలు వేలం వేసి కొత్త ధరలు నిర్ణయించడానికి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అద్దెలు పెంచడానికి తీసుకుంటున్న చర్యలను అంగీకరించాలని ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు సూచించారు. గురువారం యానాంలో మున్సిపల్ దుకాణాల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. యానాం ప్రాంతానికి చెందిన పలు మున్సిపల్ దుకాణాలకు సంబంధించి మార్కెట్ ధరలకు అనుగుణంగా రూ.500 నుంచి రూ.2 వేల నెలసరి అద్దెలు పెంచేలా మల్లాడి ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కమిషనర్ గుబ్బ గౌరీసరోజ, ఏఈ మేడిశెట్టి రామలింగేశ్వరరావు, మనోహర్, పోలిశెట్టి ఆదినారాయణ బృందం పాల్గొన్నారు.

## ప్రధాని కార్యాలయం నుంచి స్పందన

ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 25న పుదుచ్చేరి వచ్చిన సమయంలో పుదుచ్చేరి, కారైకాల్, యానాంలలో క్రీడాసదుపాయాల ఏర్పాటు గురించి తాను అందజేసిన వినతిపత్రాలపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి పూర్తి వివరాలు సమర్పిస్తే నిధులు మంజూరుకు అనుమతులు ఇస్తామంటూ ఉత్తర్వులు పంపారని ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు.

**యానాం:** ఈనెల నుంచి మూడు నెలలపాటు దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి 20 కిలోలు, ఎగువనున్నవారికి 10 కిలోల ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించి మళ్లీ ఆటంకం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం ఏపీఎల్ జాబితాలోని పసుపు కార్డులకు బియ్యం పంపిణీ నిలిపివేయాలంటూ పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని డీడీ ఆదేశించారు.

# జూన్‌లో జిప్‌మెర్ నిర్మాణ పనులకు ఏర్పాట్లు: మల్లాడి

**యానాం, న్యూస్‌టుడే:** యానాంతోపాటు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్(జిప్‌మెర్) సంస్థ మల్టీ స్పెషాలిటీ కన్సల్టెంట్ యూనిట్ నిర్మాణం జూన్‌లో ప్రారంభించేలా దశలవారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. గురువారం సాయంత్రం మంత్రి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిప్‌మెర్ యూనిట్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన నర్సీ క్వార్టర్స్ స్థలంలో ఉన్న ఎనిమిది భవనాల కూల్చివేత ఈ నెలాఖరులోగా పూర్తవుతుందని, మే మొదటివారంలో జిప్‌మెర్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ విభాగం అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులతో చర్చించి పనుల ప్రారంభ తేదీని నిర్ణయిస్తామన్నారు. ఫిబ్రవరి 9న దిల్లీలో జరిగిన సెంట్రల్ ఫైనాన్స్ సమావేశంలో యానాం జిప్‌మెర్ నిర్మాణానికి రూ.28.45 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారని, మార్చిలో సీపీడబ్ల్యూడీతో ఒప్పందం కుదుర్చుకుని వారికి రూ.22.50 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. 82 పడకలతో నిర్మిస్తున్న ఈ యూనిట్‌లో 42 పడకలు కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఆర్థో, హైరిస్క్ అబ్‌స్ట్రెటిక్స్‌కు, 15 పడకలు ఆర్థోపెడిక్, సర్జరీ, హైరిస్క్ అబ్‌స్ట్రెటిక్స్‌కు, 10 పడకలు ఐసీయూ, 10 పడకలు మెడికల్, 5 పడకలు ఆర్థో విభాగానికి కేటాయించారన్నారు. ఆసుపత్రిలో యంత్రసామగ్రికి రూ.30.39 కోట్లు కేటాయించగా రూ.17.90 కోట్లు గతేడాది బడ్జెట్‌లో విడుదల చేశారన్నారు. జిప్‌మెర్ యూనిట్‌కు అనుసంధానంగా యానాం ప్రభుత్వాసుపత్రిని ఆధునీకరించాల్సి ఉందని, అప్పుడే రోగులకు మెరుగైన సేవలందుతాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

## రూ.2.13 కోట్లతో స్మార్ట్ స్కూళ్లు

యానాంలోని పెరుంతలైవర్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గిరియాంపేట), డాక్టర్ కె.ఆర్.నారాయణన్ హైస్కూల్(దరియాలతిప్ప), డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ హైస్కూల్(వరంపేట), రాజీవ్‌గాంధీ ఆంగ్లమాధ్యమ పాఠశాల, కమలానెహ్రూ బాలికోన్నత పాఠశాల, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్(మెట్టకూరు), కామిశెట్టి పరశురామ వరప్రసాదరావు నాయుడు హైస్కూల్ (కనకాలపేట), శారదా విద్యానికేతన్ ఎయిడెడ్ పాఠశాలల్లో కంప్యూటర్లను ఏర్పాటు చేసి రూ.2.13 కోట్లు పారిశ్రామిక సామాజిక బాధ్యత నిధులతో స్మార్ట్ స్కూళ్లను జూన్‌లోగా నిర్మించనున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు.



ఈవీఎంను పరిశీలిస్తున్న పరిపాలనాధికారి

# ఈవీఎంల పరిశీలన

**యానాం, న్యూస్‌టుడే:** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు యానాం పౌరకార్యాలయం స్ట్రాంగ్‌రూంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను, బ్యాలెట్టింగ్ యూనిట్లను గురువారం అధికారులు పరిశీలించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ప్రత్యేక సూచనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా ఈవీఎంలకు సంబంధించిన బార్‌కోడ్‌లు, ఇతర వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ గుబ్బ గౌరీసరోజ, ఉప తహసీల్దార్లు షైజు, జయచంద్రన్ తదితరులు నిర్వహించారు.

ఈనాడు 20 APR 2018

# మొక్కవోని అభిరుచి

## డాబాపై అరుదైన మొక్కల పెంపకం

న్యూస్‌టుడే, యానాం



మొక్కల్ని పరిశీలిస్తున్న రామసుధాకర్

సొంతిల్లే కాదు.. అద్దె ఇంటిలోనూ పచ్చదనం పరిఢవిల్లేలా చేయొచ్చని ఆయన నిరూపిస్తున్నారు. యానాంలోని అన్నం గార్డెన్స్ నివాసి సుందర రామ సుధాకర్ మొక్కలను అపురూపంగా వాటిని పెంచుతున్నారు. రోజూ పూజ చేయడం తమ పెద్దల నుంచి అలవాటుగా అందిపుచ్చుకున్న ఆయన అన్నం గార్డెన్‌లోని వీవీఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు ఇంట్లో రెండో అంతస్తులో నివసిస్తూ డాబాపైన పూలు, పండ్ల మొక్కలు సుమారు 200 వరకు సంరక్షిస్తున్నారు. ఈయన ఎమ్మెస్సీ బీఈడీ చదివినా తనకు ఇష్టమైన గార్డెనింగ్‌ను జీవనోపాధిగా మార్చుకుని తాళ్లరేవు మండలం గాడిమొగలోని రిలయన్స్ పరిశ్రమలో గ్రీన్ గ్రాస్ కాంట్రాక్ట్ సంస్థ తరఫున హార్టికల్చర్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఆయన డాబా పైన కుండీల్లోనే సంపెంగ, గన్నేరు, కలువ, పైనాపిల్, బ్రహ్మకమలం వంటి జాతులతో పాటు కొన్ని రకాల ఎడారి మొక్కలు, గులాబీ, మందార, మామిడి తదితరాలను పెంచుతున్నారు.





ఆకట్టుకుంటున్న ఎడారి జాతి మొక్కలు



### చిన్ననాటి నుంచి...

మలికిపురం మండలానికి చెందిన సుందర రామసుధాకర్ రైతు కుటుంబం నేపథ్యం నుంచి వచ్చారు. ఈయనకు వివిధ రకాల పండ్ల మొక్కల్ని అంటు కట్టి పెంచడం, అంతర పంటలు వేయడంపై ఎంతో ఆసక్తి. వాటిపై అనేక ప్రయోగాలు చేసి గుర్తింపు పొందారు. మామిడి అధిక దిగుబడి సాధించి 2007లో ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. లక్ష్మీవరం నీటి సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. యానాంలో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న ఫలపుష్ప ప్రదర్శన పోటీల్లో గత రెండేళ్ల నుంచి పాల్గొని ద్వితీయ బహుమతి పొందారు. పూల మొక్కలే కాదు.. బాల్కనీలో పక్షుల కోసం ప్రతి రోజు ధాన్యం గింజల్ని ఆహారంగా వేస్తుంటారు. చిలుకల కోసం ధాన్యం కంకులు కడుతుంటారు. వివిధ రకాల పూలు, ఇతర మొక్కల జాతులపై 'ఈనాడు'లో ప్రతి శనివారం ప్రచురితమయ్యే కథనాల్ని ఆరేళ్ల నుంచి సేకరించి ఫైల్ తయారు చేశారు.



చిలుకలకు ఆహారం కోసం ఏర్పాటు చేసిన పళ్లెం

20 APR 2018

## పోస్టర్ల కేసును కొట్టివేసిన కోర్టు

యానాం: పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావును కించపరుస్తూ గతంలో పుదుచ్చేరిలో పోస్టర్లు అతికించిన కేసును గురువారం పుదుచ్చేరి కోర్టు కొట్టివేసింది. 2008లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మల్లాడి కృష్ణారావుకు పుదుచ్చేరిలో వ్యతిరేకంగా పోస్టర్లు అతికించిన వ్యక్తులపై పెరియాకాడల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మురసోలి మారన్ కౌన్సిల్ కు చెందిన నటరాజన్, సాలిఅలగర్, సత్య అనే వ్యక్తులపై కేసు నమోదుచేశారు. కేసును విచారించిన జడ్జి పద్మనాభన్ కేసును కొటివేస్తూ తీర్పునిచ్చారు.

సాక్షి

# పార్క్ నిర్వహణపై నిర్లక్ష్యం

- బుద్ధాపార్క్ నిర్వహణను పట్టించుకోని యంత్రాంగం
- శిథిలమైన చెక్క వంతెన, పాడైపోయిన ఆటసామగ్రి
- దుర్వాసన వెదజల్లుతున్న చెరువులో నీరు



బుద్ధాపార్క్ ముఖ ద్వారం


బుద్ధుని విగ్రహం వైపు వెళ్లే చెక్క వంతెనకు అడ్డంగా పెట్టిన కర్రలు

యానాం: ఆసియా జ్యోతిగా వెలుగొందుతున్న తథాగతుడు గౌతమ బుద్ధుని పార్క్ నిర్వహణపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. పీడబ్ల్యూడీ శాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు కృషితో యానాం పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్ చెరువు ప్రాంగణంలో కోట్లాదిరూపాయల ఖర్చుతో నిర్మించిన బుద్ధాపార్క్‌ను 2010నవంబర్ 27న అప్పటి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, ప్రస్తుత పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణసామి చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే గౌతమ బుద్ధుడి శిలావిగ్రహాన్ని చెరువు మధ్యలో వుండేలా ఏర్పాట్లు చేసి అక్కడ ప్రతిష్ఠించారు. అవిధంగా విగ్రహం చుట్టూ గౌతమ బుద్ధుని విశేషాలతో కూడిన శిలావిగ్రహాలను ప్రతిష్ఠించడంతో పాటు పగోడా నిర్మాణ ఆకృతిలో చుట్టూ వివిధ నిర్మాణాలను చేశారు. అవిధంగా పార్క్ అందరిని ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు.

**శిథిలమైన చెక్కవంతెన..**

చెరువు మధ్యలో ప్రతిష్ఠించిన బుద్ధుడి శిలావిగ్రహం వద్దకు చేరుకోవడానికి వీలుగా ప్రారంభం రోజున అప్పటికప్పుడు చెక్క వంతెనను తాడిపట్టతో నిర్మించి రైలింగ్‌గా చెక్కలను ఏర్పాటు చేశారు. అయితే అప్పటినుంచి శాశ్వత వంతెన నిర్మించకపోవడంతో అదికాస్తా శిథిలమై పోయింది. దీంతో ప్రతిష్ఠించిన బుద్ధుడి విగ్రహం వద్దకు ఎవరూ వెళ్లలేని పరిస్థితి నెలకొనివుంది. వంతెన ప్రమాదకరంగా ఉండడంతో పర్యాటకులు ఎవరూ వెళ్లకుండా గేటుకు ఇరువైపులా కర్రలు పెట్టారు.

**తుప్పుబట్టిన ఆటసామగ్రి..**

పార్క్‌లో ఏర్పాటు చేసిన పిల్లలు ఆడుకునే ఆటసామగ్రి సైతం తుప్పు పట్టిపోవడంతో పిల్లలు ఆడలేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా జారుడుబల్ల, ఉయ్యాల వంటివి ప్రమాదకరంగా మారాయి. ఆటసామాగ్రికి మరమ్మత్తులు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

వెలగని విద్యుత్ లైట్లు

పార్క్‌కు అందాన్ని చేకూర్చేవిధంగా ఏర్పాటుచేసిన విద్యుత్ లైట్లు సైతం పాడయిపోయి వుండడంతో అదంతా కళావిహీనంగా కన్పిస్తుంది. చుట్టూ గడ్డి పెరగిపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం వుందని పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకులు కూర్చునే మెట్ల నిర్మాణ ప్రాంతం పగుళ్లు వస్తున్నాయి.

**నాచుపట్టి...దుర్వాసనతో చెరువు:**

బుద్ధుడి విగ్రహం నిలిపివున్న చెరువులోని నీరు బయటికి పోయే మార్గం లేకపోవడంతో ఆ నీరు అక్కడే నిల్వవుండిపోవడంతో నీరు నల్లగా మారిపోతోందని పలువురు అంటున్నారు. దీంతో ఒక్కోసారి నీరు దుర్వాసన వస్తుందని అన్నారు. నీరు పోయే మార్గం వుంటే సమస్య రాదని అంటున్నారు. తక్షణం అధికారుల స్పందించి బుద్ధాపార్క్‌కు మరమ్మతులు చేయాలని అవిధంగా పర్యాటకులు ఆహ్లాదాన్ని ఇచ్చేవిధంగా తీర్చిదిద్దాలని పలువురు పర్యాటకులు, అంబేద్కర్ నగర్ గ్రామస్తులు కోరుతున్నారు.


పాడైపోయిన జారుడు బల్ల తదితర ఆటసామగ్రీ



నాచుతోశుభ్రత లేకుండా వున్న బుద్ధా పార్క్ చెరువు ప్రాంతం, శిథిలమైన చెక్కవంతెన

# మాతాశిశు సంక్షేమానికి ప్రాధాన్యం

**మంత్రి మల్లాడి**


బాలింతలకు వస్తుసామగ్రితో కూడిన కిట్‌లను అందజేస్తున్న మంత్రి మల్లాడి

యానాం: ప్రభుత్వం మాతా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని అవిధంగా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తుందని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖచే సమకూర్చబడిన వివిధ వస్తువులతో కూడిన కిట్‌లను స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద బాలింతలకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ సందర్భంగా 198 మంది బాలింతలకు వివిధ మందులు, పౌడర్ డబ్బా, దోమతెర తదితర వస్తువులతో కూడిన కిట్లను ఆయన అందజేశారు.

**ఆర్థిక సహాయం అందజేత**

వివాహం సందర్భంగా అందజేసే ఆర్థిక సహాయాన్ని మంత్రి మల్లాడి కృష్ణారావు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా 48 మందికి రూ.15వేలు చొప్పున, 8మందికి రూ.20వేలు చొప్పున సాంఘిక సంక్షేమ శాఖ నుంచి అందజేశారు. అదేవిధంగా వ్యవసాయశాఖ నుంచి రైతులకు గునపాలు, పారలు, స్ప్రేర్స్‌ను ఆయా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కమిషనర్ సరోజ, సాంఘికసంక్షేమాధికారి చింతా రామకోగి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొబైల్ యాప్ ద్వారా ఈవీఎంల ట్రాకింగ్

**స్టాక్‌ను పరిశీలించిన ఎలక్టోరల్ అధికారి దవులూరి**

యానాం: పుదుచ్చేరి ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా ఈవీఎంల ట్రాకింగ్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం ఈవీఎంలను పరిపాలనాధికారి, ఎలక్టోరల్ అధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు పరిశీలించారు. స్థానిక సివిల్ స్టేషన్‌లో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంల స్టాకును వివిధ రాజకీయపార్టీల నాయకులతో ఆయన పరిశీలించారు. మొబైల్ ట్రాకింగ్ యాప్ ప్రక్రియ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నప్పుడు ఈవీఎంలు ఏ ప్రాంతాల్లో వున్నాయి తదితర విషయాలను తెలుసుకోవడానికి ఉపకరిస్తుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గౌరీసరోజ, ఎలక్షన్స్ ఓఎస్‌డీ జయచంద్రన్, ఎన్నికల విభాగ డీలింగ్ అసిస్టెంట్ సేతం వంకీకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిరాజుద్దీన్, డీఎంకే నాయకుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

20 APR 2018

# వివిఆర్ కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

యానాం,ఏప్రిల్19,(ప్రభాతవార్త)

తాళ్లరేవు మండలం ఇంజరంలో నిర్మించనున్న వి.వి.ఆర్.కల్యాణమండపం నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంజరం మాజీ సర్పంచ్ వత్సవాయి రామచంద్రరావు ఈ కల్యాణమండపంను నిర్మిస్తున్నారు.ఈ నిర్మాణానికి ఉదయం భూమిపూజ కార్యక్రమాన్ని వేదపండితులు ఆధ్వర్యంలో వత్సవాయి రామచంద్రరావు, శ్రీదేవి దంపతులు వైభవంగా నిర్వహించారు.అలాగే ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రిమల్లాడి కృష్ణారావు,ఉదయలక్ష్మి దంపతులు పాల్గొని పూజలు చేశారు.ఈ సందర్భంగా కల్యాణమండపం నిర్మాణంకు సంబంధించి వివరాలను వత్సవాయి రామచంద్రరావును మంత్రి అడిగి తెలుసుకున్నారు.అలాగా ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ముమ్మిడివరం నియోజక వర్గం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజులు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్,దొమ్మేటి వెంకటేశ్వర్లు,ఇంజరం సర్పంచ్ ఆకెళ్ల శ్రీనివాస సుబ్బారావు,చిట్టాల సూర్యనారాయణ, అడ్డా వెంకట రమణ,కె.సత్యనారాయణమూర్తి, చిక్కాల నరసింహ మూర్తిలు తదితరులు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా కల్యాణ మండపంను నిర్మిస్తున్న ఇంజరం మాజీ సర్పంచ్ వత్సవాయి రామచంద్రరావు మాట్లాడుతూ ఈ కల్యాణమండపంను తన తండ్రి పేరు మీద నిర్మిస్తున్నట్లు తెలిపారు.గత కొంతకాలం నుంచి కల్యాణమండపం నిర్మించాలని తాను అనుకున్నానని అయితే ఇప్పటికి సాకారమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు దంపతులకు,ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు,ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు తదితర ప్రముఖులకుకృతజ్ఞతలు తెలిపారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో వత్సవాయి కుటుంబ సభ్యులు, స్థానికులతో పాటు యానాం,గోవలంక, తాళ్లరేవు నాయకులు, తదితరులు పాల్గొన్నారు



భూమిపూజ చేస్తున్న పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు దంపతులు.

20 APR 2018

## సంక్షేమ పథకాలతో లబ్ధి

ప్రజాశక్తి - యానాం

సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుతుందని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆయన ఛాంబర్‌లో గురువారం 198 మందికి మెడి సిన్, నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. వితంతు ఆడపిల్లల వివాహ నిమిత్తం రూ. 20 వేలు చొప్పున ఎనిమిది మందికి అందజేశారు. ఆరుగురికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.75 వేలు, వికలాంగులకు రెండేళ్ల కాలపరిమితి ఉన్న ధ్రువీకరణ పత్రాలు 123 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రభుత్వ హాస్పటల్ డిడిప్రసాద్, సంక్షేమశాఖాధికారి రామజోగి పాల్గొన్నారు.

## ఎల్ఇడి విద్యుత్ దీపాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యానాం దరియాలతిప్ప న్యూఫిషర్‌మెన్ కాలనీలో స్ట్రీట్ లైట్లకు ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేశారు. వీటిని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు పాల్గొన్నారు.

## షాపు యజమానులతో మంత్రి చర్చలు

ప్రజాశక్తి - యానాం

మున్సిపల్ షాపుల అద్దె పెంపు విషయమై గురువారం షాపుయజమానులతో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ గౌరి సరోజ పాల్గొన్నారు.

20 APR 2018

## ఎల్ఈడి వీధిలైట్లు ప్రారంభం



యానాం/ప్రజాన్యూస్ : యానాం శివారు దరియాలతిప్ప న్యూ ఫిష ర్‌మెన్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్ట్రీట్ లైట్లను పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి అనంతరం స్విచ్ ఆన్ చేసి వీధి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు, గ్రామస్తులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.